క్లుప్తంగా

డీఆర్ఎం కప్ విజేత ఎలక్ట్రికల్ ఆపరేషన్ జట్టు

ట్రోఫీ అందజేసిన డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో 8వ డీఆర్ఎం కప్ ఇంటర్ డిపార్ట్‌మెంట్ క్రికెట్ టోర్నమెంట్ ఈ నెల 12 నుంచి 20 వరకు రైల్వే స్టేడియంలో జరిగింది. ఇరవై ఓవర్ల ఫార్మెట్ లీగ్ దశలో జరిగిన మ్యాచ్‌ల్లో ఎలక్ట్రికల్ ఆపరేషన్ జట్టు, రాయనపాడు వ్యాగన్ వర్క్‌షాపు జట్లు ఫైనల్‌లో తలపడ్డాయి. ఎలక్ట్రికల్ విభాగం తొలి ఇన్నింగ్స్‌లో 183 పరుగులు చేసింది. రాయనపాడు వ్యాగన్ వర్క్‌షాపు జట్టు 170 పరుగులు చేసి పది పరుగుల తేడాతో ఓటమి చెంది రన్నర్‌గా నిలిచింది. శుక్రవారం జరిగిన ముగింపు వేడుకల్లో డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ పాల్గొని విజేత జట్టు కెప్టెన్, సీనియర్ ఏఎల్‌పీ కె.సాగర్‌కు ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ డీఎస్‌సీ, డివిజన్ స్పోర్ట్స్ ఆఫీసర్ వల్లేశ్వర బి.టి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

జాతీయ స్కేటింగ్ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారుల సత్తా

విజయవాడస్పోర్ట్స్: జాతీయ స్కేటింగ్ పోటీల్లో ఏపీ క్రీడాకారులు సత్తా చాటారు. బెంగళూరు, మైసూరు, కోయంబత్తూరులో జరిగిన పోటీలకు రాష్ట్రం నుంచి 371 మంది స్కేటర్లు ఆర్టిస్టిక్, స్పీడ్, హాకీ, స్పెషల్ చిల్డ్రన్స్ విభాగాలకు ప్రాతినిధ్యం వహించి 168 పతకాలను సాధించారు. ఈ సందర్భం పురస్కరించుకుని విజేతలను ఏపీ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్‌రెడ్డి, థామసయ్య, కోశాధికారి అనిర్బన్ పాల్, సీఈవో డి.భగీరథ్‌కుమార్ తదితరులు అభినందించారు.

వాలీబాల్ పోటీల్లో 'పీబీ సిద్ధార్థ'కు మూడో స్థానం



విజయవాడస్పోర్ట్స్: కృష్ణా యూనివర్సిటీ అంతర కళాశాలల వాలీబాల్ మహిళల పోటీల్లో పీబీ సిద్ధార్థ ఆర్ట్స్, సైన్స్‌కాలేజీ జట్టు మూడో స్థానం సాధించినట్లు కాలేజీ క్రీడా శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ టి.వి.బి.కృష్ణారెడ్డి తెలిపారు. వర్సిటీ పోటీల్లో పతకం సాధించిన జట్టును కళాశాల అధ్యక్షుడు డాక్టర్ సి.నాగేశ్వరరావు, కార్యదర్శి పి.లక్ష్మణరావు, కన్వీనర్ ఎస్.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వి.బాబురావు, డీన్ రాజేష్ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం అభినందించారు.

ఉప్పు భూముల్లో మట్టి స్వాహా

- సెంట్రల్ గవర్నమెంట్ మట్టి దిబ్బలను బద్దలు కొడుతున్న తెలుగు తమ్ముళ్లు
- మహిళా ప్రజాప్రతినిధి భర్తతో చేతులు కలిపిన 'సాల్టు' అధికారులు!
- తిరగబడిన గ్రామస్తులు!



మంగినపూడిలోని సాల్టు భూముల్లో మట్టిని ట్రాక్టర్లలోకి లోడు చేస్తున్న జేసీబీ

కోనేరుసెంటర్: ఉప్పు భూముల్లో మట్టిని స్వాహా చేస్తున్నారు 'తమ్ముళ్లు'. మండలంలో ఇప్పటి వరకు స్టేట్ గవర్నమెంట్ భూముల్లోనే మట్టిని మాయం చేసిన తెలుగు తమ్ముళ్లు ప్రస్తుతం సెంట్రల్ గవర్నమెంట్ భూముల్లోనూ మట్టిని మింగేస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు తల ఊపుతున్నట్లు సమాచారం. దీంతో అంతా మా ఇష్టం కాదంటే కష్టం అన్నట్లు తెలుగు తమ్ముళ్లు మట్టిని దోచేస్తున్నారు. పెద్ద పెద్ద మిషన్లతో మట్టిని బయటికి లాగుతూ ట్రాక్టర్లలోకి వేస్తున్నారు. తద్వారా లక్షల్లో సొమ్మును మింగేస్తున్నారు. జిల్లా ప్రధాన కేంద్రానికి ఐదు కిలోమీటర్ల దూరంలో జరుగుతున్న అవినీతి దందాను అడ్డుకునేందుకు సాల్ట్ అధికారులు అడుగు ముందుకు వేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

150 ఎకరాల సాల్ట్ భూములు

బందరు మండలం మంగినపూడిలో సుమారు 150 ఎకరాల సాల్ట్ భూములు ఉన్నాయి. వీటిని సమీప గ్రామ రైతులకు సంబంధిత అధికారులు ఏటా లీజుకు ఇస్తుంటారు. రైతులు వేరుశనగ, సరుగుడు తదితర పంటలను వేసుకుని వచ్చిన ఆదాయంలో లీజు సొమ్మును చెల్లిస్తుంటారు. నిన్న మొన్నటి వరకు రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన పోర్టు భూములను టార్గెట్ చేసి మట్టి దిబ్బలను మాయం చేసిన తెలుగు తమ్ముళ్లు ప్రస్తుతం సెంట్రల్ గవర్నమెంట్‌కు చెందిన సాల్ట్ భూములపై కన్నేశారు. అక్కడి మట్టి కన్నేసిన సిరివెళ్లపాలెం గ్రామానికి చెందిన ఓ మహిళా ప్రజాప్రతినిధి భర్త సాల్ట్ భూములకు సంబంధించిన అధికారిని మచ్చిక చేసుకున్నారు. నయానో భయానో.. మట్టిని మాయం చేసేందుకు ఒప్పుకునేలా చేశాడు. అందుకు ఆ అధికారి తల ఆడించడంతో రాత్రికి రాత్రే పెద్ద పెద్ద మిషన్లను రంగంలోకి దింపారు. ట్రాక్టర్లలోకి మట్టిని లోడ్ చేసి మంగినపూడి సమీప గ్రామాల్లోకి తరలించడం మొదలు పెట్టారు. అలా ట్రక్కును రూ. 1500 చొప్పున అమ్ముకుంటూ సాల్టు భూముల్లోని మట్టిని లాగేస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు పది ఎకరాల వరకు మట్టిని లాగేసినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. దీంతో లక్షల్లో ప్రభుత్వ సొమ్మును స్వాహా చేసేస్తున్నారు.

అడ్డుకున్న గ్రామస్తులు

గతంలో సాల్ట్ భూములు జోలికి వెళ్లాలంటే సెంట్రల్ గవర్నమెంట్ భూములు మనకెందుకు అంటూ అందరూ భయపడేవారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత తెలుగు తమ్ముళ్లు అలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడేందుకు వెనకడుగు వేయడం లేదు. ప్రభుత్వం ఏదైనా అధికారం మాదే అనుకుంటున్నారో ఏమోగానీ అవినీతికి పాల్పడేందుకు ఎక్కడ అవకాశం వచ్చినా తగ్గేదేలే అంటున్నారు. అయినకాడికి అవినీతికి పాల్పడుతూ ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టేస్తున్నారు. మంగినపూడి సాల్టు భూముల్లోని మట్టిని అక్రమంగా అమ్ముకుంటున్న తతంగాన్ని ఆ ఊరి గ్రామస్తులు శుక్రవారం అడ్డుకునేందుకు ప్రయత్నించారు. సాల్టు భూములకు కాపలాగా ఉన్న ఓ అధికారి గ్రామస్తులపై విరుచుకుపడి మా ఇష్టం.. మీ ఇష్టం వచ్చింది చేసుకోండి అనడంతో గ్రామస్తులు అక్కడి నుంచి వెనుదిరిగినట్లు తెలుస్తోంది. ఈ తతంగమంతా సాక్షాత్తు మైనింగ్‌శాఖ మంత్రి ఇలాకాలో జరుగుతున్నా పట్టించుకోకపోవడం సర్వత్రా విమర్శలకు దారి తీస్తుంది. సాల్టు అధికారులైనా పట్టించుకుని మట్టి మాఫియాపై కఠిన చర్యలకు ఉపక్రమించాలని మంగినపూడి గ్రామస్తులు కోరుతున్నారు.

ఇళ్లను తొలగిస్తే ఊరుకోం..

- తొలగించబోమని హామీ ఇచ్చిన ప్రజాప్రతినిధి
- ఎమ్మెల్యే మాటను ఖాతరు చేయని ఆర్ అండ్ బీ అధికారులు
- 60 ఏళ్ల నుంచి నివసిస్తున్న ఇళ్లను కూల్చివేసేందుకు ప్రయత్నిస్తున్న అధికారులు
- అడ్డుకున్న ప్రజలు



చెవిటికల్లు రోడ్డులో అధికారులను అడ్డుకున్న మహిళలు

కంచికచర్ల : కంచికచర్ల, చెవిటికల్లు రహదారిలో రోడ్డు పక్కన కట్టిన ఇళ్లను తొలగిస్తున్న ఆర్ అండ్ బీ అధికారులను శుక్రవారం ప్రజలు అడ్డుకున్నారు. 60 ఏళ్ల క్రితం కట్టుకుని నివాసముంటున్న ఇళ్లను తొలగిస్తారా అని మహిళలు అధికారులను ప్రశ్నించారు. వాటిని తొలగిస్తే సహించబోమని హెచ్చరించారు తమ ఇళ్లను తొలగించవద్దని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యకు విన్నవించుకున్నామని దీనిపై ఆమె హామీ ఇచ్చారని మహిళలు తెలిపారు. నివసిస్తున్న ఇళ్లకు ఇంటిపన్ను, నీటిపన్ను, విద్యుత్ బిల్లులు క్రమం తప్పకుండా చెల్లిస్తున్నామని తమ ఇళ్లను కూల్చేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. దాదాపు 400 కుటుంబాలు ఇళ్లు కట్టుకుని జీవిస్తున్నాయని మా ప్రాణాలైనా ఇస్తాం నివాసాలను తొలగిస్తే మా బతుకులు బుగ్గిపాలవుతాయని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు.

రెండుసార్లు నోటీసులు ఇచ్చాం: ఆర్ అండ్ బీ డీఈఈ శశిభూషణ్

కంచికచర్ల మండలం చెవిటికల్లు నుంచి కంచికచర్ల అంబేడ్కర్ సెంటర్ వరకు 8.7కిలోమీటర్ల మేర ఆర్ అండ్ బీ రోడ్డును విస్తరించడానికి కేంద్ర ప్రభుత్వం అవసరమైన నిధులు మంజూరు చేసిందని ఆర్ అండ్ బీ డీఈఈ శశిభూషణ్ శుక్రవారం తెలిపారు. సెంట్రల్ రోడ్డు ఫండ్ కింద రూ. 11కోట్లు మంజూరయ్యాయన్నారు. రోడ్డు పక్కన ఆక్రమణలు తొలగించాలని రెండుసార్లు నోటీసులు ఇచ్చామని అయినా వారు తొలగించలేదన్నారు. తామే స్వయంగా జేసీబీ, పొక్లెయిన్‌లతో తొలగించే పనులు చేపట్టామన్నారు. రోడ్డు పక్కన కట్టుకున్న లబ్ధిదారులు తమ ఇళ్లను తొలగించవద్దని వినతిపత్రం అందజేశారని తెలిపారు. దీన్ని జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేస్తామని డీఈఈ చెప్పారు.

క్రీడా యాప్ సవరణలు చేయండి

ఏపీ ఒలింపిక్ సంఘం కార్యదర్శి కె.పి.రావు

విజయవాడస్పోర్ట్స్: నకిలీ క్రీడా సర్టిఫికెట్లను నిలువరించడానికి ఏర్పాటుచేసిన క్రీడా యాప్‌లో సవరణలు చేయాల్సి ఉందని ఏపీ ఒలింపిక్ సంఘం కార్యదర్శి కె.పి.రావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుతం క్రీడా సంఘాలు క్రీడాకారుల పేర్లను నమోదు చేసుకుని పోటీలు నిర్వహించి విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్‌లు ఇస్తున్నాయని వివరించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన యాప్‌లోనూ ఇదే తరహాలో పేర్లు నమోదు మాత్రమే చేస్తారని, ఎలాంటి ప్రయోజనం ఉండదని పేర్కొన్నారు. 40 ఏళ్లుగా క్రీడా సంఘాల్లో జరుగుతున్న అవినీతి, అక్రమాలను చూస్తున్నానని, గతంలో మాన్యువల్‌గా జరిగే అక్రమాలు.., ఇకపై యాప్‌లో స్మార్ట్‌గా జరుతాయన్నారు. స్పోర్ట్స్ కోడ్‌ను సమర్థంగా అమలు చేస్తే అక్రమాలు జరిగే అవకాశం ఉండదని, సర్టిఫికెట్‌ల దందాకు కొంత వరకు బ్రేక్ పడే అవకాశం ఉంటుందన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

యలమర్రు(పెదపారుపూడి): విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన యలమర్రులో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యలమర్రులో ఉన్న శ్రీ రామేశ్వరస్వామి ఆలయంలో ముఖమండపం మరమ్మతుల కోసం ఉయ్యూరు మండలం కడవకొల్లు గ్రామానికి చెందిన దేవబత్తుల నాగభూషణం(45) తాపీ పనుల నిమిత్తం గోడ పగలకొట్టే మిషన్‌తో పనులు చేస్తున్నాడు. అతని షాక్ తగిలి ఘటనా స్థలిలోనే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

ఆత్మీయ కలయిక



వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని శుక్రవారం ఆ పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ గన్నవరం విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి ముందస్తుగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.
– లబ్బీపేట(విజయవాడతూర్పు)

అంతరాయం లేని డిజిటల్ సేవలు

- సీఎంఎస్‌తో తప్పిపోయిన చిన్నారుల జాడ
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీ దీక్ష విరమణలకు వచ్చే లక్షలాది భక్తులకు అంతరాయం లేని డిజిటల్ సేవలు అందించడానికి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో శుక్రవారం కలెక్టర్ లక్ష్మీశ.. టెలికం నెట్‌వర్క్–ఇంటర్నెట్ సేవల ప్రొవైడర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు జరిగే భవానీ దీక్షల విరమణకు పటిష్ట కమ్యూనికేషన్ ప్రణాళికను అమలుచేస్తున్నామన్నారు. డ్రోన్లు, రకరకాల యాప్స్, పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టమ్, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్.. తదితరాలు పూర్తిస్థాయి ఫలితాలు ఇవ్వాలంటే సమర్థమైన నెట్‌వర్క్ సేవలు అవసరమని పేర్కొన్నారు. సమావేశంలో డీఐపీఆర్‌వో యు.సురేంద్ర నాథ్, ఏపీఎస్ఎఫ్ఎల్, బీఎస్ఎన్ఎల్, రిలయన్స్ జియో తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

తప్పిపోయిన చిన్నారుల జాడ కనిపెట్టే సీఎంఎస్

భవానీ దీక్షల విరమణ సమయంలో తప్పిపోయిన చిన్నారుల జాడ కనిపెట్టేందుకు, వారి సమాచారాన్ని తల్లిదండ్రులకు చేరవేయడానికి వీలుగా దుర్గగుడి చైల్డ్ మానిటరింగ్ సిస్టమ్(సీఎంఎస్) అందుబాటులోకి తెచ్చిందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఈ వ్యవస్థతో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి చిన్నారుల వివరాలను నమోదు చేసి చేతికి క్యూ ఆర్ కోడ్ బ్యాండ్ వేస్తారన్నారు. ఎవరైనా పిల్లలు తప్పిపోతే స్కాన్ చేయగానే పిల్లల పేరు, తల్లిదండ్రుల పేరు, తల్లిదండ్రుల ఫోన్ నంబర్, తల్లిదండ్రులతో ఫోన్ చేయడానికి లేదా వాట్సాప్ ద్వారా సంప్రదించడానికి ఆప్షన్లు ఉంటాయన్నారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ సీఎంఎస్ పనితీరును పరిశీలించారు. చేయాల్సిన మార్పులపై అమరావతి సాఫ్ట్‌వేర్ ఇన్నోవేషన్స్ సీఎండీ అనీల్ కుమార్‌కు సూచనలు చేశారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు



పామర్రు కుమ్మరిపేటలో సెమీక్రిస్మస్ వేడుకల్లో పాస్టర్లు

పామర్రు: పామర్రులో సెమీ క్రిస్మస్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కుమ్మరిపేటలోని గాస్పిల్‌క్రిస్టియన్ అసెంబ్లీలో పాస్టర్ ఎస్.శామ్యూల్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథులు దైవజనులు ఎం.శ్యామ్‌సన్, డాక్టర్ బి.పాల్, అబ్బూరి మోజెస్‌డానియేలు, పాస్టర్లు ఆకుల ప్రవీణ్, సోమశ్వరరావు, రెవరెండ్ యేసుదాసు, ట్రెజరర్ ఇశ్రాయేల్, జాయింట్ సెక్రటరీ రవికుమార్ పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: స్థానిక ఆర్సీఎం చర్చి వద్ద శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా భైరవపట్నం విచారణకర్తలు రెవరెండ్ ఫాదర్ సంకర్ల శాంతిరాజు, రెవరెండ్ ఫాదర్ ప్రదీప్ సెమీ క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు. మాజీ సర్పంచ్ గుడివాడ చిట్టిబాబు, ఎం.సత్తిబాబు, సంఘ పెద్దలు సురేష్, యేసుదాసు, పాల్గొన్నారు.

చాట్లవానిపురంలో..

స్థానిక చాట్లవానిపురంలో విజన్ లైఫ్ సెంటర్‌లో సెమీక్రిస్మస్ వేడుకలను ఏపీ క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్ కొల్లాబత్తుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

గుడ్లవల్లేరు: స్థానిక ఏఏఎస్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ హైస్కూల్లో సెమీ క్రిస్మస్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అభ్యుదయ స్కూల్ ప్రిన్సిపాల్ జి.కిశోర్‌బాబు, హైస్కూల్ డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి, ప్రిన్సిపాల్ లీనా కుమారి పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో క్రీడాకారుడికి బంగారు పతకం

గుడివాడ టౌన్: ఎన్టీఆర్ స్టేడియం క్రీడాకారుడు పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించినట్లు స్టేడియం ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం స్టేడియం కార్యాలయంలో బంగారు పతకం సాధించిన జి. దుర్గా సత్యనారాయణను పాలక మండలి సభ్యులు సత్కరించారు. ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు హైదరాబాద్‌లో పవర్ లిఫ్టింగ్ పెడరేషన్ నిర్వహించిన పోటీలో తమ క్రీడాకారుడు 74 కిలోల విభాగంలో డెడ్ లిఫ్ట్ నందు 225 కిలోల బరువును ఎత్తి ఈ విజయాన్ని సాధించారని పేర్కొన్నారు.



సత్యనారాయణను అభినందిస్తున్న పాలక మండలి సభ్యులు

దీక్షల విరమణ బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన

విజయవాడస్పోర్ట్స్: ఇంద్రకీలాద్రి వద్ద శనివారం ఉదయం నుంచి జరిగే భవానీ దీక్షల విరమణ బందోబస్తు ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు శుక్రవారం రాత్రి పరిశీలించారు. దేవస్థానం సమీపంలోని మోడల్ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూం నుంచి డీసీపీలు గౌతమి శాలి, తిరుమలేశ్వరరెడ్డి, ఆనందరెడ్డితో పరిశీలించారు.

శివక్షేత్రానికి 'కోటిలింగాల' దత్తత!

ఆగమేఘాలపై అధికారుల అప్పగింత



శివస్వామికి రికార్డులు అందజేస్తున్న ఏసీ సీతారామయ్య

జగ్గయ్యపేట: ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలంలోని ముక్త్యాల సమీపంలో దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలోని కోటిలింగ హరిహర మహాక్షేత్రంలో కామాక్షి సమేత పంచముఖ అమృతలింగేశ్వర స్వామి ఆలయాన్ని గుంటూరు జిల్లా తాళ్లాయపాలెం శైవక్షేత్ర వ్యవస్థాపకుడు శివస్వామికి దత్తత ఇచ్చారు. ఈ మేరకు ఎన్టీఆర్ జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సీతారామయ్య శుక్రవారం ఆలయ రికార్డులను అప్పగించారు. ఈ సందర్భంగా శివస్వామి విలేకరులతో మాట్లాడుతూ.. 2006లో 132 ఎకరాల స్థలాన్ని అప్పటి వ్యవస్థాపకుడు కంచికచర్లకు చెందిన గద్దె ప్రసాద్‌తో కలిసి క్షేత్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. రెండేళ్లపాటు స్వామి, అమ్మవార్లకు పూజా కార్యక్రమాలు నిర్వహించామని ఆ క్రమంలో ప్రసాద్‌తో భిన్నాభిప్రాయాలు రావడంతో దూరంగా ఉన్నానని తెలిపారు. 2009లో క్షేత్రాన్ని రెండేళ్ల కాల పరిమితిలో ప్రహరీ, రాజగోపురం నిర్మించే ఒప్పందంతో దేవదాయ శాఖకు అప్పగించారన్నారు. ఈ క్రమంలో 2021లో భక్తులు రాకపోతుండటంతో ఆదాయం తగ్గిందని నిర్వహణ కష్టంగా ఉందని గద్దె ప్రసాద్ తన దృష్టికి తీసుకొచ్చారని పేర్కొన్నారు. దీన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, ఆలయాన్ని తిరిగి అప్పగించాలని కోరినట్లు చెప్పారు. దీంతో దేవదాయ శాఖ అధికారులు కోటిలింగ హరిహర క్షేత్రాన్ని దత్తత ఇస్తున్నామని చెప్పి రికార్డులు అందజేయగా ధర్మాధికారిగా తాను బాధ్యతలు చేపట్టినట్లు చెప్పారు. ఆలయానికున్న సుమారు 40 ఎకరాల్లో మాజీ మంత్రి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాంకు చెందిన భూములు కూడా ఉన్నాయని, స్వామి వారికి ఇచ్చామనే ఉద్దేశంతోనే రఘురాం భూములను అడగడం లేదని చెప్పారు.

అధికారుల అప్పగింత

కోటిలింగ క్షేత్రాన్ని దేవదాయ శాఖాధికారులు శివస్వామికి ధారాదత్తం చేయటంపై గ్రామస్తులు, భక్తులు అవాక్కయ్యారు. 48 గంటల్లోనే అప్పగించడం కూడా పలు అనుమానాలకు తావిస్తోందని గ్రామస్తులు అంటున్నారు. ఆలయంలో పని చేస్తున్న 16 మంది అర్చకులు, సిబ్బంది పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీనికి తోడు సమీపంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులకు చెందిన భూములు ఉండటంతో ఆ కోవలోనే శివస్వామికి దత్తత ఇచ్చారనే కోణంలో భక్తులు, ప్రజలు సంశయం వ్యక్తం చేస్తున్నారు. దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సీతారామయ్య మాట్లాడుతూ.. కోటిలింగ క్షేత్రంపై 2008లో లోకాయుక్తలో వ్యక్తి ఫిర్యాదు చేశారని, దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు శివస్వామికి దత్తత ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ హరిదుర్గానాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సన్మానం



రైతులను సన్మానించిన స్టేట్‌బ్యాంక్ మేనేజర్ రవికుమార్

వెంట్రప్రగడ(పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడ స్టేట్ బ్యాంక్‌లో శుక్రవారం రైతు దినోత్సవం నిర్వహించారు. స్థానిక రైతులను బ్యాంక్ మేనేజర్ రవికుమార్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ అన్నం పెట్టే రైతుల దినోత్సవం సందర్భంగా వారిని సన్మానించటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ సిబ్బంది చైతన్య, నాగేంద్రబాబు, నాగరాజు, చంద్రశేఖర్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

సీపీఐ బలోపేతానికి కృషి

గుడివాడ టౌన్: కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (సీపీఐ) ను బలోపేతం చేసేందుకు ప్రతి నాయకుడు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి టి. తాతయ్య పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26న సీపీఐ శత జయంతి ఉత్సవాలు గుడివాడ నియోజకవర్గంలో నిర్వహించాలని నిర్ణయించామన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డుల పంపిణీ, పెన్షన్‌ల అక్రమ తొలగింపు తదితర అంశాలపై ఈ సదస్సు ఉంటుందన్నారు. నియోజకవర్గ కార్యదర్శి ప్రకాష్‌బాబు, సహాయ కార్యదర్శి సత్యనారాయణ, కె.సురేష్, స్వామి, అంజి పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో అల్లూరి విద్యార్థిని ప్రతిభ



విద్యార్థిని మధును అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ముదినేపల్లి రూరల్: అల్లూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని మద్దా మధు కబడ్డీ పోటీల్లో ప్రతిభచూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎస్.రామోజీరావు శుక్రవారం తెలిపారు. ఈ నెల 22 నుంచి 25 వరకు తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో మధు పాల్గొంటున్నట్లు తెలిపారు. విద్యార్థిని మధును వ్యాయమ ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు, విద్యా కమిటీ చైర్మన్ వెంకటశ్యామల అభినందించారు.

ప్రత్యేక పూజలు



పామర్రు: స్థానిక రుక్మిణీసమేత వేణుగోపాల స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలను చేశారు. ధనుర్మాసం సందర్భంగా గోదాదేవి రంగనాథ స్వామికి పంచామృతాలతో అభిషేకం చేశారు.

పాఠశాలలు ఏర్పాటు చేయరా?

టిడ్కో కాలనీలో చిన్నారుల అవస్థలు

గుడివాడ టిడ్కో కాలనీలో విద్యార్థులు చదువుకునేందుకు పట్టణంలోని పాఠశాలలకు వచ్చేందుకు ఇబ్బందులుపడుతున్నారు. ఆటోల్లో భద్రతలేని ప్రయాణంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. టిడ్కో కాలనీ పాఠశాలలు ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


సైకిళ్లపై పాఠశాలకు వెళుతున్న విద్యార్థులు


ఆటోల కోసం నిరీక్షిస్తున్న చిన్నారులు

గుడివాడ టౌన్: టిడ్కో కాలనీ వాసుల చిన్నారులకు విద్య దూరమవుతోంది. గత ప్రభుత్వం 9,812 మంది పేదల కోసం టిడ్కో కాలనీ ఏర్పాటు చేసి వాటిని లబ్ధిదారులకు అందజేసింది. అప్పటివరకు పేదరికంలో మగ్గుతున్న లబ్ధిదారులు ఇళ్లలో చేరిపోయారు. వారు మౌలిక సదుపాయాలు ఎలా ఉన్నా అక్కడే జీవనం సాగిస్తూ పిల్లలకు చదువు చెప్పిస్తున్నారు. అయితే కాలనీ ఏర్పాటులో భాగంగా అక్కడ ఏర్పాటు చేయాల్సిన విద్యాలయాలు ఏర్పాటు కాకపోవడంతో తల్లిదండ్రులు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

టిడ్కో కాలనీ నుంచి పట్టణానికి..

పట్టణ పరిధిలో నేడు ఉన్నత పాఠశాలల్లో బాలురు 1,229 మంది, బాలికలు 1,419, మొత్తం 2,648 మంది. ప్రాథమిక పాఠశాలలు 25 ఉండగా వాటిలో బాలురు 804, బాలికలు 866, మొత్తం 1,670 మంది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారు. వీరు కాక వివిధ ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు సైతం టిడ్కో కాలనీ నుంచి రోజూ పట్టణానికి వస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వారిలో 20 శాతం పైబడి టిడ్కో కాలనీ నుంచి వస్తున్నారని పాఠశాలల ఉపాధ్యాయులు చెబుతున్నారు. సుమారు ఉన్నత పాఠశాలలకు చెందిన 550 మంది, ఇక ప్రైవేట్ పాఠశాలల్లో చదివేవారు 350 మంది. మొత్తం 900 పైబడి చిన్నారులు రోజూ టిడ్కో కాలనీ నుంచి పట్టణంలోని అన్ని ప్రాంతాలకు వివిధ మార్గాలలో పాఠశాలలకు తరలివెళుతున్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయులు, విద్యార్థుల నిష్పత్తి ఆధారంగా 22 మందికి పైబడి ఉపాధ్యాయులతో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు ఇక్కడ ఏర్పాటు చేయాల్సి ఉంది. కనీసం ప్రాథమిక పాఠశాల కూడా అందుబాటులో లేకపోవడంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం వీరి అవస్థలు వర్ణనాతీతం.

ట్రాఫిక్ కష్టాలెన్నో..

టిడ్కో కాలనీ నుంచి గుడివాడ పట్టణంలోని పలు ప్రాంతాలకు ప్రయాణించాలంటే ట్రాఫిక్ కష్టాలు వర్ణణాతీతం. ప్రధానంగా రైల్వే ఫ్లై ఓవర్ నిర్మాణంలో భాగంగా నిత్యం ఏదో ఒక భాగంలో ట్రాఫిక్ ఇబ్బందులు. దీనికి తోడు భారీగా పెరిగిన రైళ్ల రాకపోకలతో గేటువేస్తే కనీసం 20 నుంచి అర్ధగంట సేపు గేట్లు మూసివేస్తారు. ఇది ఇలా ఉండగా ప్రయాణ సౌకర్యాలు లేక కూడా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు వస్తే బిడ్డలు తడిసి పోతున్నారని పాఠశాలల్లో తడిబట్టలతోనే ఉండాల్సి వస్తోందని చిన్నారుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు చార్జీల భారం మోయలేనంతగా ఉంది. ఈ నేపథ్యంలో విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తక్షణమే పాఠశాలలు ఏర్పాటు చేయాలని టిడ్కో కాలనీ వాసులు కోరుకుంటున్నారు.

పొంతన లేని సమాధానాలు

టిడ్కో కాలనీలో పాఠశాలల ఏర్పాటుపై మున్సిపల్ కమిషనర్‌ను వివరణ కోరగా అది కేవలం విద్యా సంస్థకు సంబంధించిన అంశం.. పురపాలక సంఘానికి, పాఠశాలల ఏర్పాటుకు సంబంధం ఉండదని పేర్కొన్నారు. ఇక ఉన్నత విద్యాశాఖ అధికారులను వివరణ కోరగా పురపాలక సంఘం పాఠశాలలుగా ఇవి గుర్తించబడతాయి. భవనాలు (కనీస వసతి) కలిస్తే ప్రాథమిక పాఠశాలలైనా ఏర్పాటు చేసేందుకు మండల విద్యాశాఖాధికారుల ద్వారా ఏర్పాటే చేసే అవకాశం ఉంది. భవనాలు లేకుండా పాఠశాలలు ఎలా కొనసాగించాలి అని సమాధానం చెబుతున్నారు.

ఆటోకు నెలకు రూ.1,000 చెల్లించాలి



నాకు ఇద్దరు పిల్లలు. పట్టణంలోని పాఠశాలకు వెళ్లేందుకు ఆటోకు నెలకు రూ. 500 చెల్లిస్తున్నాం. ఇద్దరికి రూ.1,000 చెల్లిస్తున్నాం. ఆటో రాని పక్షంలో ఒక్కొక్కరికి రోజుకు రాను పోను రూ.60 చొప్పున ఇద్దరికి రూ.120 చెల్లించాల్సి వస్తోంది. ప్రైవేట్ ఆటోలో ఎక్కించాలంటే భయంగానే ఉంటుంది. ఈ నేపథ్యంలో వెంటనే పాఠశాలలు ఏర్పాటు చేయాలి.

– అంబటి లక్ష్మి, టిడ్కో కాలనీ

పిల్లలు ఇంటికి వచ్చే వరకు భయమే



గుడివాడ-మచిలీపట్నం, గుడివాడ-పామర్రుకు సంబంధించి పట్టణంలోకి వెళ్లే రోడ్లన్నీ ట్రాఫిక్‌తో రద్దీగా ఉంటాయి. భారీ వాహనాలు వేగంగా వస్తూ పోతుంటాయి. కొందరు ఆటో చార్జీలు భరించలేక సైకిళ్లపైనే పిల్లలను పాఠశాలలకు పంపుతున్నారు. పట్టణంలోని ఏ ప్రాంతానికైనా కనీసం ఐదు నుంచి ఎనిమిది కిలోమీటర్లు వెళితేగాని పాఠశాలకు చేరుకోలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందోనని నిత్యం భయపడుతూనే పిల్లలను పాఠశాలలకు పంపుతున్నాం.

– భారతి, టిడ్కో కాలనీ

ప్రకృతి వ్యవసాయంతో తెగుళ్ల నివారణ

ముదినేపల్లి రూరల్: ప్రకృతి వ్యవసాయంతో మినుము పైరుకు సోకే తెగుళ్లు, పురుగులను సులభంగా నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ అధికారి పి.మధు అన్నారు. మండలంలోని బొమ్మినంపాడు దళితవాడలో రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినుము పైరుపై సోకే పాగాకు లద్దె పురుగును నివారించేందుకు ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన బ్రహ్మాస్త్రం అనే మందు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం బ్రహ్మాస్త్రం తయారు చేసే విధానాన్ని రైతులకు ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి గౌతమ్‌కుమార్, నారాయణ, అనూష తదితరులు పాల్గొన్నారు.





చార్వికకు సన్మానం



గుడ్లవల్లేరు: స్థానిక ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ హైస్కూల్లో మూడో తరగతి విద్యార్థిని గొట్టిపాటి చార్విక అబాకస్ పోటీల్లో అంతర్జాతీయ స్థాయిలో విజయం సాధించింది. ఆ విద్యార్థినికి లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారు స్థానిక లయన్స్ సేవాభవన్‌లో సన్మానం చేశారు. లయన్స్ చైర్మన్ శశికళ తదితరులు పాల్గొన్నారు.

గృహ లబ్ధిదారుల సమస్యలను పరిష్కరిస్తాం

కైకలూరు: గృహ నిర్మాణ లబ్ధిదారుల సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చెప్పారు. కలిదిండి లే అవుట్ లబ్ధిదారులు కాలనీ వద్ద ఎమ్మెల్యేను కలిసి సమస్యలను వివరించారు. కామినేని మాట్లాడుతూ లెవెలింగ్, రహదారి సరిగా లేకపోవడంతో నీరు నిల్వ ఉంటుందన్నారు. మట్టితో లెవెలింగ్, రోడ్డు నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని హౌసింగ్ డీఈ శేఖర్‌ను ఆదేశించారు.

మట్టిని బయటి ప్రాంతాలకు తరలిస్తే కేసులు

కైకలూరు: ప్రజా అవసరాలకు మినహాయించి ట్రాక్టర్లు, టిప్పర్లతో మట్టిని నియోజకవర్గం దాటి బయటకు తరలించి విక్రయిస్తే కేసులు నమోదు చేయడంతోపాటు వాహనాలను సీజ్ చేయాలని పోలీసులను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ సుమారు 45 టన్నుల బరువుతో మట్టి టిప్పర్లు తిరగడంతో రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన రహదారులు ఛిద్రమవుతున్నాయన్నారు. ఇకపై జాతీయ రహదారి పనులకు మాత్రమే టిప్పర్లు వినియోగించాలరు. ట్రాక్టర్ల ద్వారా స్థానిక అవసరాలకు మట్టిని ఉపయోగించుకోవచ్చని చెప్పారు. కైకలూరు రహదారుల్లో పశువుల సంచారం అధికంగా ఉందని దీంతో ప్రమాదాలు, ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని చెప్పారు. జనవరి నుంచి రోడ్లపై సంచరించే పశువులను గోశాలకు తరలిస్తామన్నారు. కార్యక్రమంలో రూరల్ సర్కిల్ సీఐ వి.రవికుమార్, ఎస్సైలు వి.రాంబాబు, సీహెచ్.రామచంద్రరావు, వి.వేంకటేశ్వరరావు, ఆర్.శ్రీను పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

అంబేడ్కర్‌ను అవమానిస్తే సహించేది లేదు

గుడివాడ టౌన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానిస్తే సహించేది లేదని దళిత సంఘాల నాయకులు అన్నారు. స్థానిక నెహ్రూచౌక్ సెంటర్‌లో దళిత సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి క్షమాపణ చెప్పాలని నాయకులు డిమాండ్ చేశారు. క్షమాపణ చెప్పని పక్షంలో దేశ వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి దారం కురుణాకర్, దళిత సంఘాల నాయకులు గాబ్రియేల్, సీహెచ్ జోషి, విల్సన్‌బాబు, యెషయ్య, చిన్నా, విజయ్‌కుమార్, నాని పాల్గొన్నారు.

అమిత్ షా రాజకీయాల నుంచి తప్పుకోవాలి


ధర్నా చేస్తున్న దళిత సంఘాల నాయకులు

కైకలూరు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా రాజకీయాల నుంచి తప్పుకోవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు నోబుల్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తప్పించాలని కోరారు.

వైఎస్ జగన్ పుట్టినరోజు వేడుకలను విజయవంతం చేయండి

గుడివాడరూరల్: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవ వేడుకల్లో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని మండల ఆ పార్టీ మండల అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ శనివారం మండలంలోని దొండపాడు, మోటూరు, పర్నాస, రామనపూడి, తటివర్రు, సీపూడి, కాశీపూడి తదితర గ్రామాల్లో వైఎస్ జగనన్న పుట్టినరోజు వేడుకలను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుడివాడ టౌన్: విద్యుత్ లైన్‌లు, సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఈఈ జీబీ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మార్వాడిగుడి, శ్రీరామ్‌పురం, చేపల మార్కెట్, భీమేశ్వరస్వామి దేవస్థానం పరిధి, ముబారక్ సెంటర్, నెహ్రూచౌక్, బంటుమిల్లి రోడ్‌లోని కొంతభాగంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

తోట్లవల్లూరులో..

పామర్రు: తోట్లవల్లూరులో శనివారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఉయ్యూరు విద్యుత్‌శాఖ ఏఈఈ డి.కృష్ణానాయక్ శుక్రవారం తెలిపారు. తోట్లవల్లూరు, యాకమూరు, దేవరపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

సైకిల్‌పై శ్రీశైలం యాత్ర

కైకలూరు: శివమాలధారులు సైకిల్‌పై శ్రీశైలం పయనమయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం గునిపూడి నుంచి బయలుదేరి ఏడుగురు భక్తులు కైకలూరు మీదుగా శుక్రవారం పయనించారు. మార్గమధ్యంలో కైకలూరు టౌన్ హాలు వద్ద భవానీ మాలధారుడు బి.బాలాజీ, శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు అల్పాహారాన్ని వీరికి అందించారు. భీమవరానికి చెందిన శివ మాలధారులు కమలశేఖర్, శ్రీనివాసరావు, సత్యహరినాథ్, మల్లేశ్వరరావుతో పాటు మాలధరించని గాంధీ, జి.బాబీ, గణేష్ యాత్రలో పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

మండవల్లి: రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలు పరిష్కరించుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ కే గోపాల్ అన్నారు. మండలంలోని చింతపాడు, దయ్యంపాడులో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఆర్ఐ శ్రావణి, వీఆర్వో యువరాజ్, సర్పంచ్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

చిన్నపాలపర్రులో..

ముదినేపల్లి రూరల్: రెవెన్యూ గ్రామ సభలతో రైతుల భూముల సమస్యలను పరిష్కారమవుతాయని తహసీల్దార్ జేఎస్ సుభానీ అన్నారు. మండలంలోని చిన్నపాలపర్రులో రెవెన్యూ గ్రామసభ శుక్రవారం నిర్వహించారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: కూరాడ పంచాయతీ కార్యాలయ ఆవరణలో రెవెన్యూ సదస్సులను శుక్రవారం నిర్వహించారు.మండల ప్రత్యేకాధికారి గుమ్మా రమేష్, ఎంఆర్ఐ పి.శివకుమార్‌పాల్గొన్నారు.


కైకలూరు : కలిదిండి పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ సదస్సుకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ హాజరయ్యారు. సర్పంచ్ మారుతీప్రసన్న పాల్గొన్నారు.

బొమ్ములూరులో..

గుడివాడరూరల్: రెవెన్యూపరమైన సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని తహసీల్దార్ వాసిరెడ్డి రామ కోటేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని బొమ్ములూరు గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు.

మొవ్వలో..

మొవ్వ: మండలంలోని వేములమడ, కూచిపూడి పంచాయతీ కార్యాలయాల్లో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో ఐదు అర్జీలు అందినట్లు తహసీల్దార్ కే మస్తాన్ తెలిపారు. ఈ సదస్సుల్లో ప్రత్యేక అధికారి విజయవర్ధనరావు, కూచిపూడిలో సర్పంచ్ కె వెంకటరమణ విజయలక్ష్మి, రీ సర్వే డీటీ జగన్‌మోహన్‌రావు, డీటీ (రెగ్యులర్) రఘురాం తదితరులు పాల్గొన్నారు.



తూర్పు కృష్ణా డెల్టా పీసీ వైస్ చైర్మన్‌గా గణేష్

పామర్రు: తూర్పు కృష్ణా డెల్టా సాగునీటి సంఘ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్‌గా పామర్రు టీడీపీ నేత వల్లూరిపల్లి గణేష్‌ను శుక్రవారం ఎంపిక చేస్తూ ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయి. మచిలీపట్నంలోని కలెక్టరేట్ వద్ద శనివారం ఎంపిక అనంతరం, పదవీ ప్రమాణ స్వీకరణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కూటమి పార్టీ సమీకరణాల్లో భాగంగా పీసీ చైర్మన్ పదవిని జనసేన పార్టీకి చెందిన కోడూరు మండలం డీసీకి ఇచ్చారు.

ప్రకటన

[illegible]

షెడ్యూల్ : [illegible]

ప్రకటన

[illegible]

పి.డి.యస్.వి.బాలాజీ, బి.కాం.బి.ఎల్.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

గుడివాడరూరల్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. మండలంలోని బొమ్ములూరులో జలజీవన్ మిషన్ నిధులు రూ.56లక్షలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్ ట్యాంక్‌ను ప్రారంభించారు. తొలుత ట్యాంక్ నిర్మాణానికి స్థలం వితరణగా అందించిన దాత త్రినాథరావును ఎమ్మెల్యే సత్కరించారు. గుత్తా శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.